# చేదు నిజం

ఆ వూర్లో నాకు క్రొత్తగా ఏర్పడ్డ స్నేహితులలో సుందరి ముఖ్యురాలు. మా ఇల్లు సుందరి ఇల్లు ప్రక్క ప్రక్కనే వుండటంచేత యిద్దరి స్నేహం త్వరలోనే బలపడింది. ఆయన ఆఫీసుకి, పిల్లలు స్కూల్‌కి వెళ్ళాక నేను సుందరి యింటికి వెళ్ళడమో సుందరి మా యింటికీ రావడమో మామూలు.

సుందరికి ముప్ఫై యేళ్ళుంటాయి. పచ్చగా కళకళలాడే మొహం మంచి సంస్కారం, సాహిత్యంలో అభిరుచి, మాటకారితనం వున్న దేమో బాతాఖానీలో ఎంతసేపైనా కాలక్షేపం అయిపోతుంది.

ఆరోజు....వాళ్ళ ఫామిలీ ఆల్బం పట్టుకొచ్చి ఫొటోలు చూపిస్తూ అందరి గురించి చెపుతూ వుంది సుందరి.

పేజీలు తిరగేస్తున్న నా చూపు అక్కడే నిలిచిపోయింది! అది ఒక పెళ్ళి ఫొటో! అతను సూటు, టైలో ఓ మాదిరిగా వున్నాడు. ఆమె మాత్రం ఎంతో బాగుంది. పెద్ద పెద్ద కళ్ళు తీర్చి దిద్దినట్టున్న ముక్కు, నోరు....ఆ కళ్ళలో గాలంవేసినట్టు నిలిపే ఆకర్షణ వుంది.

అలా చూస్తున్న నా ఆలోచనని పసిగట్టినట్టు సుందరి అంది "మా అన్నయ్య, వదిన!"

"చాలా బాగుంది ఆమె....పేరేమిటి!"

"అనూరాధ!...." అంది. సుందరిలో ఉత్సాహం ఎందుకో కొడి గట్టినట్టనిపించింది. ఏమిటో కారణం తెలుసుకోవా లనిపించింది. ఏమని అడగాలో తోచలేదు.

"లవ్ మేరేజి యిద్దరిది!....ఆ ఫొటో వెనక పెద్ద కథ దాగివుంది తెలుసా!" కాసేపటికి సుందరే అంది.

పెద్ద కథ వుందని చెప్పిన మనిషి కథ కూడా చెప్తుందని తెలుసు. చెప్పమన్నట్టు చూశాను. సుందరి మొదలుపెట్టింది—

"చాలారోజుం క్రిందటి సంగతి."

నాన్నగారు మలబారులో డివిజనల్ ఇంజనీరుగా భరత్ పూషా బ్రిడ్జి కట్టిస్తూ వుండేవారు. ముందు అంతదూరం బదిలీమీద వెళ్ళటానికి ఇష్టపడలేమ. ఆఖరికి తప్పక బయలుదేరారు. అమ్మతోపాటు చదువయి పెళ్ళికి సిద్ధంగా వున్న నేనూ వెళ్ళాను. చెల్లెల్ని, తమ్ముడ్ని అమ్మమ్మ గారింట్లో పెట్టారు. అన్నయ్య ఉద్యోగం చేసుకుంటున్నాడు.

అదొక చిన్న వూరు. నాన్నగారి పనిజరిగే చోటుకి యిల్లు మూడు నాలుగు మైళ్ళుంటుంది. లంకంత బంగళా! ఎప్పుడో మిషనరీస్ కట్టిన బంగళాలో నాన్నగారు పనిమీద వెళ్ళిపోయాక అమ్మ నేను బిక్కు బిక్కు మంటూ ఉండేవాళ్ళం. చుట్టూ అన్నీ గుడిసెలు! కొంచెం దూరంలో ఓ చర్చి! చర్చిలో జర్మన్ మిషనరీస్! .... వాళ్ళకి ఇంగ్లీషు రాదు. నాకు మళయాళం రాదు! మాట్లాడుదామన్న ఎవరూ లేక విసిగెత్తిపోయే దాన్ని. అందుకని కుట్లు, పుస్తకాలతో కాలక్షేపం అవుతుంది. రోజూ సాయంత్రం పనిమనిషిని వెంటబెట్టుకుని అలా అటు ఇటు తిరిగి వచ్చేదాన్ని.

ఓరోజు....ప్రతీసారికంటె బాగా దూరం వెళ్ళాను .... అక్కడో పెద్ద మేడముందు, గేటుదగ్గర నిలబడి కల్యాణికుట్టి కన్పించింది. మొదటి చూపులోనే యిద్దరూ ఒకరినొకరు ఆకర్షింపబడ్డాం.... ఆ వూరిలో కొత్త చదువుకున్న దానిలాపున్న ఆమెతో ఎలాగైనా పరిచయం పెంచుకోవా లనిపించింది. మర్నాడు అదే త్రోవన కావాలని వెళ్ళాను. కళ్యాణి రెండోరోజున మా పనిమనిషిని దగ్గరకు పిలిచి మళయాళంలో మాట్లాడింది. తర్వాత నన్ను ఇంగ్లీషులో పలకరించి లోపలికి పిలిచింది. లోపలికి వెళ్ళాను. యిల్లు చాలా పెద్దది. కళ్యాణి తండ్రి సుబ్రమణ్యకుట్టి కంట్రాక్టు పనులు చేసి బాగా గడించాడు. ఆ వూళ్ళో యిల్లు కట్టుకొని, పొలాలు

కొబ్బరితోటలతో స్థిరపడ్డాడు, చక్కగా అలంకరించిన గదులు, సోఫాలు తివాచీలు, ఎంతో బాగుంది యిల్లు.

కళ్యాణి బి. ఏ. ప్యాసయి పెళ్ళికి సిద్ధంగావుంది. సిరిసంపద లకు లోటులేని ఆ యింట్లో అన్నీ వున్నా ... ఆ యింట్లో ఏదో కళ లోపించినట్టుండేది. కళ్యాణి తల్లి కావేరమ్మగారు ఎప్పుడూ మతిలేని దానిలా ఏదో ఆలోచిస్తూ విచారంగా కనిపించేది. సుబ్రమణ్యంగారూ అదోలా కనిపించారు.

అ విచారానికి కారణం.... తర్వాత.... కళ్యాణికి నాకు స్నేహం బలపడ్డాక తెలిసింది. కళ్యాణికి ఒక్కగా నొక్క అన్నయ్య. చేతికందిన పాతికేళ్ళవాడు నారాయణకుట్టి చనిపోవడమేనని .... చనిపోయి ఏడాది మాత్రమే అయిందని తెలిశాక వారి విచారానికి కారణం తెల్సింది.

ఆ చనిపోవడమూ మామూలుగా లేదని కళ్యాణి చెప్పినప్పుడు తెల్సుకోవాలన్న నా కుతూహలాన్ని అణుచుకోలేకపోయాను.

ఆ విషయం చెపుతూంటే కళ్యాణి కళ్ళలో నీరు తిరిగింది. ఆమె బాధ నా కర్థం అయింది.

నారాయణన్, కళ్యాణీలతో ఆ యింట్లో వాళ్ళ మేనత్త కూతురు కూడా వాళ్ళతోపాటు చిన్నప్పటినుంచి పెరిగింది. ఆ అమ్మాయికి చిన్న ప్పుడే తల్లీ తండ్రీ పోతే వీళ్ళ ఇంట్లోనే పెరిగిందట, చెల్లెలి కూతురంటే ఎంతో ముద్దుట సుబ్రమణ్యంగారికి ! 'బేబీ'' అని ముద్దుగా పిల్చేవారట. నారాయణ, బేబి యీడు జోడు కలసిన వారవడంచేత చిన్నప్పటినించి వాళ్ళిద్దరిని ఆ ఇంట్లో భార్యాభర్తలుగానే జమకట్టి మాట్లాడేవారు. వాళ్ళూ యెంతో చనువుగా వుండేవారు.

నారాయణ ఇంజనీరింగ్ ప్యాస్ కాగానే ఫారిన్ స్కాలర్‌షిప్‌కి దరఖాస్తు పెట్టాడు. చదువులు అయిపోయాయి. పెళ్ళిచేయాలనుకునేం తలో అతనికి కొద్ది నోటీసలో స్కాలర్‌షిప్ రావడంతో పెళ్ళికి వీలులేక పోయింది. జర్మనీ వెళ్ళేముందు బి. ఏ ప్యాసయివున్న బేబీని రెండేళ్ళూ

ఊరికే కూర్చోవడం ఎందుకన్న ధోరణిలో నారాయణే పట్టుపట్టి ఆమెని మద్రాసులో క్వీన్ మేరీస్‌లో చేర్చాడు.

నారాయణ కొద్దిగా సున్నితమైన మనిషి ! ఆదర్శభావాలు, కవిత్వ ధోరణి వున్నవాడు. ఫ్రాంస్‌ఫర్టు వెళ్ళిన దగ్గిరనించి వారం వారం విధిగా బేబికి ఉత్తరాలు రాసేవాడు. యిద్దరూ కలిసీ మెలిసి మాట్లాడుకున్నప్పుడు, తిరిగినపుడు కలిగే చిన్న పోట్లాటలు, మాట పట్టింపులు, చిలిపి కజ్జాలు అన్నీపోయి అన్ని వేల మైళ్ళ దూరాన వుండడం మూలాన ఇదివరకటి కంటె సన్నిహితులైనారు. యిద్దరి ఉత్తరాల్లో ఒకరి యెడ ఒకరికిగల అభిమానాలు పోటీపడి, ఒకర్ని మించి ఒకరు అభిమానం, ప్రేమ, గాఢంగా వ్యక్తం చేసుకునేవారు ఉత్తరాలలో.

ఒక ఏడాది గడిచాక కొద్ది కొద్దిగా బేబి ఉత్తరాలలో మార్పు గమనించాడు నారాయణ. అతని ఆందోళన క్రమేపి ఉత్తరానికి ఉత్తరానికి హెచ్చసాగింది. ఆ ఉత్తరాలన్నీ కళ్యాణి నాకు చూపించింది.

నిజంగా ఎంత బాగున్నాయో ఆ ఉత్తరాలు ! చదువుతూంటే .... మళ్ళీ మళ్ళీ చదవాలనిపించేంత మధురంగా వున్నాయి. వాటిల్లో కొన్ని అదే పనిగా చదివాను. కంఠతా కూడా వచ్చాయి ఆ మాటలు ! ఆ తర్వాత సరదాకి ఒకసారి కూర్చుని ఆ ఇంగ్లీషులోవి అన్నీ తెలుగులోకి మార్చి కాగితం మీదకి ఎక్కించాను కూడాను....

"దేశంకాని దేశంలో అందరి మధ్య వుంటూనే ఒంటరి తనం అనుభవిస్తూ నా ఆలోచనలే నాకు తోడు, నీడా, బంధువు, స్నేహితుడు సర్వం అయి .... యీ రెండేళ్ళు ఎప్పుడు ముగుస్తాయో, యెప్పుడు మన వాళ్ళ మధ్య, నీ ముందు వ్రాల్తానా అని రోజులు క్షణాలు లెక్కపెట్టే నాకు, నువ్వు తప్పించి మరేధ్యాసా రాదు డార్లింగ్ ! స్ట్రక్చర్స్ పుస్తకం తీస్తాను — "ఏమిటో మహా చదివే వాడిలాగ పుస్తకం కూడానా ?" అన్నట్టు హేళనగా నవ్వుతూ నువ్వే కనిపిస్తావు. అందంగా గుండ్రని నున్నని నీ గులాబి బుగ్గల్ని మెలేయాలనిపిస్తుంది. తప్పించుకు పారి పోతుంటె చిందర వందరగా ఎగిరే నీ కురులు మమ్మల్ని పట్టుకో

లేవులే అని వెక్కిరిస్తాయి .... యింక ఏం చదవను ! ! .... అలా పుస్తకం మూసి వేగ్గా కిటికీ బయటికి చూస్తాను .... బయట ఏమిటో గోల ! .... అ శబ్దాలేవీ నాలో కెక్కవు ! నాలో నువ్వు ! నా పెదాలపై నీ ఊహలు తెచ్చిన నవ్వు !

యెవడో వస్తాడు వాడు వచ్చి నేనేదో వింతగా చూడడం మొదలు పెట్టినదాకా నేనే ముసిముసి నవ్వులు నవ్వుతున్నానన్న సంగతి నాకు తెలియదు నేరంచేసి దొరికి పోయినట్టు చూస్తాను గిల్టీగా ! .... వాడు నవ్వుతూ చూ న చూపుల్ని తట్టుకోలేక తడబడతాను, చూశావా, నువ్వు యిన్ని వేలమైళ్ళ దూరాన్నుంచి నన్నెంత నవ్వులపాలు చేస్తున్నావో !

ఇంకేటి – "డార్లింగ్, నేను రాసిన ఉత్తరం నీకందింది, మర్నాడు నువ్వు జవాబు వ్రాస్తే అది విమానం మీద యిక్కడికి రావడానికి యెన్ని రోజులు, గంటలు తీసుకునేది గుణించి నిన్న సాయంకాలం విధిగా నీ ఉత్తరం రావాలని అంచనా వేసుకుని, లాబ్నించి గదికి రాగానే తలుపు మహా ఆత్రుతగా తెరిచి ఉత్తరం లేకపోతే ఆ నిరాశతో గుండెలు బదలవుతాయేమోనన్నట్టు భయంతో మెల్లిగా తలుపు తెరిచాను ! .... లేదు ! ఎంత నిరాశ ! .... అలా ఒకరోజు కాదు ! పది రోజులు ! ప్రతి రోజూ చూసి ఎంత నిరాశ పడ్డాను ! .... నిరాశ అన్నది చాల తేలిక మాట. నా హృదయం దిగజారిన లోతుల్ని వ్యక్తం చెయ్యాలంటే ! .... యీ ప్రపంచంలో నాకన్న దురదృష్టవంతుడు లేడన్న నిస్పృహ, ఆవేదన కలిగాయి. నీ మీద పట్టరాని కోపం వచ్చింది, నీకూ జవాబీయకుండా యిలాగే ఆలస్యం చెయ్యాలన్న కసి బలంగా రేగింది.

కాని, నువ్వయితే హృదయం లేని బండరాయివి ! నీకు సున్నితాలు తెలియవు ! .... నేనో ! .... నీ ఉత్తరం రాని రోజున నేను పడ్డున్న బాధనంతనీ తల్చుకుని .... నాలాగే నువ్వూ యిబ్బంది పడ్తావేమో, ఉత్తరం రాకపోతే నాలాగే స్నేహితులందరిని వదిలి, గది కిటికీ కంకితమై పిచ్చిగా కదిలే మబ్బు తునకల్ని, పేర్లు తెలియని పక్షులని, తృప్తిగా నిర్లిప్తంగా అల్లలాడే గుల్ మొహర్ ఎర్రపూల పుల

కింతల్ని చూస్తూ, అనుకోకుండా రాలిన కన్నీటి బిందువుల్ని చెక్కిళ్ళ లోనే యింక పోనిస్తావేమో అన్న ఆలోచన రాగానే గబగబ కాగితం కలం పుచ్చుకుంటాను. నా మనసులో భావాల వేగాన్నందుకోలేని నా చేతి వేళ్ళు పిచ్చిపిచ్చిగా కలాన్ని పరుగెత్తిస్తాయి. యింత రాసినా నా అందాల రాణికి యింత పిచ్చి పిచ్చి అక్షరాలా అని నామీద నాకే కోపం వస్తుంది. అర్ధరాత్రయినా సరే కూర్చుని చక్కటి బాండ్ పేపరుమీద అక్ష రాలు తీర్చిదిద్దుతాను.

యింతటి యావ నీ కున్నట్టు తోచదు ! నీకేం, ఏం రాసినా, యెలా రాసినా మహా భాగ్యమన్నట్టు చదువుకునే వాడున్నాడుగదా అని. ఏ నోట్సు పుస్తకంలోంచే చించిపారేసిన కాగితం మీద అడ్డదిడ్డంగా రెండు లైన్లు గిలుకుతావు. డార్లింగ్, నీకీ అనుభూతులు కలగవా ! కలిగీ, నాతో దాగుడుమూతలు ఆడుతున్నావా ? రేపుకూడా నీ నించి జవాబే రాకపోతే నేనేమయిపోతానో ! ....

"నీ నించి ఉత్తరం రాని ఈ నెల రోజులలో నీకు నాలు గుత్తరాలు రాశాను. అందుకుని వుంటావు ! యెంత ఆందోళన, యెంత నరకం అనుభవించానో ఆ ఉత్తరాలు నీకు చెప్పలేకపోతే ఈ ప్రపం చంలో భాషలన్నీ వాడినా నీ కర్థంకాదు ! ఏమిటీ మౌనం ! యెందుకీ ఉదాసీనత ! నావల్ల కానిపని ఏదయినా జరిగిందా ? యేం నేరం చేశాడీ దీనుడు !

ఏమిటో, యీ నెలనించి నాకు మతిచెడినట్టుంది ఏమేమిటో జ్ఞాపకాలు వస్తున్నాయి. ఎన్నో సంఘటనలు, మన జీవితాల్లో ప్రధాన ఘట్టాలుగా నిల్చిపోయే సన్నివేశాలు ! చరిత్ర పుస్తకాన్ని తిరిగి చదువు తున్నప్పుడులా ఆ జ్ఞాపకాలన్నీ ఏదో నిర్లిప్తతనీ, వైరాగ్యధోరణిని ప్రవేశ పెడ్తున్నాయి. అవి మన యిద్దరికి సంబంధించనట్టు ఎవరో అనను. ఆమె అన్నట్టు అనిపిస్తుంది. అదే అన్నింటికన్నా ట్రాజిక్ బేబీ! మన అనుభవాలు మనవే కానట్టు అపనమ్మకం కలిగేంతగా నీవు మారిపోవడం !

జ్ఞాపకంవుందా. మాటలు వచ్చీరాని చిన్నతనంలో యెవరన్నా "నీ మొగుడెవరే!" అని కొంటెగా అడిగితే ముద్దుముద్దుగా అమాయకంగా అలా వేలితో నావైపు చూపేదానివి! మిగతా అందరూ నవ్వుతూంటే సిగ్గుతో రెండు అంటించేవాడిని నేను. కళ్ళు నులుముకుంటూ ఏడిచే నిన్నందరూ వెనకేసుకువచ్చి నన్ను కేకలేసేవారు అందరూ. ఎన్ని జన్మల అనుబంధమో యిది అనిపిస్తుంది యిప్పుడు తల్చుకుంటే. యింక గాఢమైన పవిత్రమైన సహజమైన మన అనుబంధం యిలా యెండమావిలా మారిపోయిందంటే ఎంత బాధ!

"ఆరోజు గుర్తుందా? మనం విడిపోయేరోజున ఆ సాయంకాలం యిద్దరం శాంథోమ్ యిసకలో పడవచాటున కూర్చున్నాం. దూరాన ఎలక్ట్రిక్ బల్బుల కాంతిపడి కిరణాలు బంగారు రేకుల్లా మెరుస్తున్నాయి. మనలాంటి ప్రేమపక్షులు తప్ప యింకెవరూ లేరు. అలా చీకట్లో యిద్దరం చాలాసేపు మాట మంతి లేకుండా కూర్చున్నాం. ఉన్నట్టుండి "నీవు వెళ్ళకపోతేనేం బావా!" అన్నావు గద్గదికంగా. నీ మనసులో రేగే భావం నా కర్థం అయింది. నిజానికి ఆ క్షణంలో మన యిద్దరి బావాలో చెప్పలేనంత తథాత్మ్యత వుంది పైకి "ఏమిటా పిచ్చిమాటలు" అని నీ చెంప మృదువుగా నిమిరినా నాలో ఉద్వేగం పరాకాష్ఠ అందుకుంది. నిజంగానే మన యిద్దరం యీ లోకంలో యెక్కడో యేమూలో మనకి మనమే అయి యెన్నటికీ విడని కౌగిలిలో యీ దేహాన్ని విడిచి వెళ్ళిపోవాలనిపించింది. యీ చదువులు, యీ ఉద్యోగం, పరపతి, స్థాయి యీ వేషభాషలు అన్నీ అర్థంలేని డాంబికంగా పేలవంగా కనిపించాయి. నీనించి దూరం అయి యెందుకీ చదువు. విదేశాలు వెళ్ళాననే ఘనత, అసలు యీ జీవితం ఎందుకు అన్న పెద్ద పెద్ద ప్రశ్నలు లేచాయి. ఏదో వైరాగ్యం వచ్చింది. ఆనాడు నా మనసుని ఎంత దిటవు పరచుకుంటేనో నిన్ను వదిలి వెళ్ళగలిగాను. రెండేళ్ళ యెడబాటు, విరహం మన మధ్య ప్రేమని పెంచుకుందని .... ఆ తరువాత .... భవిష్యత్తుని ఎన్నెన్ని రంగులలో ఊహించానో!

యిలా నన్ను అనుక్షణం వేధించే జ్ఞాపకాలు నీకూ కలగడం లేదా? గాలి అలలైనా నారాయణ అనే ఒకడున్నాడని గుర్తు తేవడంలేదా? ఆ గుర్తు రాగానే "పాపం పిచ్చివాడు" అని తేలిగ్గా నవ్వుకోనైనా నవ్వుకోవా? బేబీ, ఎందుకిలా మారిపోతున్నావు? ....

—"సారీ డియర్. నీకు విపరీతమైన జ్వరమనీ ఇరవై రోజులుగా హాస్పిటల్‌లో వున్నావని నాన్న రాశారు. అంతవరకు నా ఆలోచనలు రగిల్చిన వేడిలో ఏమేమో ఊహించుకుని ఆందోళనతో, ఆవేదనతో కలం పరిగెట్టినట్టు రాశాను! ఏం అనుకోవుగదూ! నీకు బాగా తెలుసు నా తత్వం! నువ్వొక ఉప్పెనవి బావా! ప్రేమయినా, కోపమైనా భరించలేవు. మరీ యింత సెన్సిటివే అయితే ఎలా బావా!" అనే దానివి, మన యిద్దరి పంటరితనంలోనే చేసిన చిలిపి పనులని మూతి ముడుచుకుని, యిప్పుడు ఆ బావే కనక క్షమించు డియర్.

యీ సంగతి విన్నప్పటినించి నా మనసింకోలా పరిగెడ్తూంది! పిచ్చిమనసు! గాజుమేడలా ప్రతి చిన్న వస్తువుని వంద అక్షరాల్లో రూపాల్లో రంగుల్లో చిత్రిస్తుంది. యెంత కుదుట పరుచుకుందామనుకున్నా కుదుటపడదు. యెలా వున్నావో! ఏం చేస్తున్నావో! ప్రమాదం ఏం లేదని రాసినా .... ఏమో నీనించి వింటేగాని నా మనసుకి శాంతి వుండదు! అల్లా నుదుటకప్పిన నీ ముంగురులు సవరిస్తూ, నీరసంగా వ్రాలే నీ కనురెప్పల్ని తేలిగ్గా పెదాల్తో తాకుతూ, నీచెంత యిరవైనాల్గు గంటలూ కూర్చోవాలని వుంది. మల్లెలు పొదిగిన విసనకర్రతో తేలిగ్గా వీస్తూ నిద్రపుచ్చాలని, మూసిన నీ కనురెప్పల చాటు రంగుల కలల్లో, నేనే కనపడి నువ్వు "ఏమిటి పిచ్చిబావా, కలల్లో కూడా నాకు విశ్రాంతి యీయవా అన్నట్టు ప్రేమగా అలవోకగా నవ్వితే ఆ పెదాల కదలికలని అలా చూస్తూ తన్మయించాలని వుంది!" —

...."ఏమిటీ మౌనం డియర్, ఎన్ని యుగాలయింది నీ ఉత్తరం చూసి అనిపిస్తుంది. రెండునెలల పదిరోజులు! యింత ఆవేదనగా రాసే నా ఉత్తరాలు నీచేత జవాబుగా నాలుగుముక్కలు వ్రాయించలేదా? ఎంత

మార్పు ! ఏ పనిమీదా మనసు లగ్నంకాదు. ఎంత అణచుకుందామన్నా అణగని ఏమేమేమిటో వింత వింత భయంకరమైన ఆలోచనలు కలుగుతాయి. ఎన్నో విపరీతమైన అనుమానాలు నన్ను వాటి యినప పంజరంలో బంధించి క్షణక్షణానికి చేరువవుతున్నట్టు బిగించి ఊపిరి సలప నీయడంలేదు ! మనసుకి శాంతిలేదు ! కంటికి నిద్రలేదు ! ఒకేసారి నామీద నాకే విపరీతమైన కోపం వస్తుంది ! నన్ను నేను అదుపులో పెట్టుకోలేని యీ బేలతనం ఏమిటి ? .... యింత వెర్రి ప్రేమ ఏమిటి ? విసుక్కుంటాను. నా పిచ్చిగాని నా యీ కోపం నీయెడ నా ప్రేమాభిమానాలని మరో రూపం మాత్రమే ! ఇది పెరిగిన కొద్దీ నీవు నాకు దూరమవడం అటుంచి మరింత చేరు వవుతున్నావు !....

....“బేబీ, నీవు నా సహనాన్ని పరీక్షించాలని యిలా దాగుడుమూత లాడుతున్నావా ? మూడు నెలల నించి జ్వరమని, పరీక్షలని, ఎక్స్కర్షన్ అని ఇంటి నించి వచ్చే ఉత్తరాలు తెలిపిన కారణాలు అబద్ధమనిపిస్తున్నాయి రోజులు గడుస్తున్నకొద్దీ ! బేబీ ! ప్రతిరోజూ ప్రతిక్షణం నీవు మారలేదని నాదానివేనని నన్ను నేను నమ్మించుకుంటూ ఓదార్చుకుంటున్నాను కాని, ఆ విశ్వాసం సన్నగిల్లిపోతుంది రోజురోజుకి, నీవు మారిపోయావు బేబీ ! .... నిన్ను నానించి ఏది దూరం చేసిందో ఎంత ఆలోచించినా అర్థం కావడంలేదు .... అసలు యీ ఆరు నెలలుగా నీ ఉత్తరాలలో ఎంతో మార్పు వుంది ! ఆ సంగతి ఇప్పుడు గుర్తించగలిగాను....

ఈ ఏణ్ణర్థంలో ఎంతో వ్రాశాను. ఎన్నో రంగుల కలలుకన్నాను. ఆ కలలన్నీ అందమైన మాటల్లో పొదిగి నీకు చూపెట్టాను కాని ఇప్పుడు నీ మౌనం నా కలలన్నీ చెదరగొట్టి వెర్రివాణ్ణి చేస్తూంది. నా కలల మహాళ్ళు పగిలి ముక్కలై, మట్టిలో పొర్లుతూ నన్ను వెక్కిరిస్తున్నట్టుంది. ఆ మాటలన్నీ ఉత్తి అర్థంలేని వంకర గీతల్లా పేలవంగా కనిపిస్తాయి ! ఏదో బాధ, అవమానం, అనుమానం అన్నీ కలిసి మనసుని కృంగదీస్తున్నాయి ! నా బాధలు వ్యథలు ఏమయినా, ఎలా వున్నా నాకు కావలసింది నీనించి ఒక మాట ! నీ అభిప్రాయాలు మారితే, మన

ఈ అనుబంధానికి నీ దృష్టిలో విలువ పోతే, ఈ బంధం నీ కిదివరకటి అనుభూతుల్ని కలిగించకపోతే, కనీసం ఆ విషయమైనా వ్రాసి నా యీ సందిగ్ధావస్థనించి విముక్తి కలిగించవూ ?

"ఎంతో వ్యధతో మూడు నెలలు ఆ ఉత్తరాలు చదువుతూంటే నాకే నారాయణమీద ఎంతో జాలి గలిగింది.

ఆఖరికి నారాయణకి ఉత్తరం అందింది. బేబీనించి కాదు. అతని తండ్రి నించి ! బేబి మనసు మారింది ! ఆమె ఎవర్నో ప్రేమించి పెళ్ళి చేసుకుంది మూడు నెలల క్రితం ! పెళ్ళిచేసుకునే ముందు నారాయణ తండ్రికి ఒక ఉత్తరం రాసి పడేసింది. ఆమె బావని చిన్నప్పటినించి చాలా అభిమానించింది. కాని ఆ అభిమానం వివాహం చేసుకోడానికి కావల్సిన ప్రేమానుభూతి కాదని. ఆమె దృష్టి మరొకరిమీద పడ్డాక గాని గుర్తించలేకపోయింది. ఆమె మనసు పరిశీలించి చూసుకుంది. ఫలితం వివాహం.

"బావను క్షమించమని కూడా అడగలేను. ఈ సంగతి బావకి తెలిపే సాహసమూ నాకు లేదు....సంగతి తెలిసి బావ ఏమనుకుంటాడో కూడా ఊహించలేను. అయినా బావపట నా కెంత అభిమానం వున్నా, స్త్రీ పురుషుల మధ్య సహజంగా కలిగే అనుభూతులు బావ సమక్షంలో నా కెన్నడూ కలుగలేదు. ఆ అనుభూతి ఎలాంటిదో నేను ప్రేమించిన వ్యక్తి సమక్షంలో తెలుసుకున్నాక, బావపట్ల నా కభిమానం తప్ప వివాహం చేసుకోడానికి వుండాల్సిన ప్రేమానుభూతి లేదని తెలుసు కున్నాను. బావ నన్నీ చదువులో పెట్టి ఎంత పొరపాటు చేశాడు ! బావ నన్ను అప్పుడే ఎందుకు పెళ్ళిచేసుకోలేదు ! అప్పుడయితే నిరభ్యంత రంగా బావని పెళ్ళాడి వుండే దానిని....ఈనాడు ద్రోహం చేశానని మీకు కృతజ్ఞత చూపడానికి బదులు కృతఘ్ను రాలినయానని నేను బాధపడ వలసిన పనిలేకపోయేది. అప్పుడే బావ పెళ్ళాడి వుంటే ? .... నన్ను క్షమించి, ఆశీర్వదించమని ప్రార్థించమని మినహా ఏం రాయలేను...."

ఆ ఉత్తరం చూసి నారాయణ తల్లిదండ్రులు నిర్ఘాంతపోయారు. బేబిపట్ల నారాయణకి ఎంతటి ప్రేమానురాగా లున్నాయో వారికి తెలుసు !

ఈ సంగతి తెలిస్తే ఆఖరవుతున్న చదువుని నిర్లక్ష్యంచేసి మనసు పాడు చేసుకుంటాడని సంగతి తెలపకుండా దాచారు. జ్వరమని - ఎక్కడికో వెళ్ళిందని ఏదో రాస్తూ కాలం గడిపేవారు. బేబికి వచ్చిన ఉత్తరాలు ఆమె పెళ్ళిచేసుకుని వెళ్ళిపోయాక, సుబ్రమణ్యంగారికి రీడైరక్టు చేయబడ్డాయి. కాలేజీనించి, కొడుకు పడే ఆవేదన, ఆందోళన చూసి అతను ఉత్తరాలమీద ఉత్తరాలు రాసి, ఆఖరికి కేబుల్ ఇస్తే తప్పక నెమ్మదిగా అసలు సంగతి రాశారు.

ఆ ఉత్తరం వెళ్ళిన పదిహేను రోజులకి జర్మనీనించి కేబుల్ వచ్చింది. "నారాయణ ఆత్మహత్య చేసుకున్నాడు!" అంత్యక్రియలు అక్కడేచేసి అతని సామానంతా వెనక్కి పంపారు అతని కాలేజి వాళ్ళు.

అప్పటినించి ఆ ఇంట్లో కళాకాంతులు లోపించాయి. ఆ తల్లితండ్రి ఒక్కగానొక్క కొడుకుని పోగొట్టుకుని మతి చెడిన వారిలా అయి పోయారు.

చెప్తున్న కళ్యాణి కళ్ళలో నీరు తిరిగింది. ఆమె బాధ నాకర్థం అయింది. "బేబీ యింతపని చేస్తుందని ఎవరం అనుకోలేదు! ఇంత కఠినురాలని ఎప్పుడూ అనుకోలేదు! అన్నయ్య బేబీచేసిన అన్యాయానికి తట్టుకోలేకపోయాడు. వెర్రిగా ప్రేమించి అభిమానించిన బేబీ తనని యిలా దగా చేయడం సహించలేక పోయాడు. అతని సున్నిత హృదయం ఆ అవమానానికి తట్టుకోలేకపోయింది. ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి తండ్రి లేని పిల్లని చేరదీసి ఎంతో ముద్దుగా పెంచిన బేబి ఆఖరికి అన్నయ్య పాలిట మృత్యువయింది" కళ్యాణి గద్గదికంగా అంది. కళ్ళు తుడుచుకుని లోపలికి వెళ్ళి ఓ ఫొటో పట్టుకువచ్చింది.

"ఇంటినిండా బేబి ఫొటోలు ఇదివరకు చాలా వుండేవి! అన్నయ్య పోయాక అమ్మ పిచ్చికోపంలో బేబి వస్తువులతో పాటు అన్ని తగలబెట్టింది. అన్నయ్య సామానులో బేబి, అన్నయ్య కలసి తీయించుకున్న యీ ఫొటో వుంటే తీసి దాచాను. అమ్మకంట బడకుండా.... చూడు ఆ మొగంలో ప్రశాంతత, అమాయకంగా చూసే ఆ కళ్ళు, ఆ మనిషిని చూస్తే ఎవరన్నా ఆమె యింతపని చేస్తుందని అనుకోగలరా...."

కళ్యాణి చూపించిన ఫొటో చూస్తుంటే నాకు కళ్ళు తిరిగినట్టయింది "ఫొటోలో కంటె యింకా చాలా అందంగా వుంటుంది ;" కళ్యాణి మాటలు నా చెవిన దూరలేదు.

అన్నయ్య ఇంట్లో చెప్పకుండా చెయ్యకుండా ప్రేమించి రిజిష్టర్ మ్యారేజి చేసుకున్న అనూరాధ ! .... బేబి ! కులంగాని అమ్మాయిని పెళ్ళాడానని అమ్మ ఏడ్చింది ! నాన్న కోప్పడ్డాడు !

ఏమయినా అన్నయ్య కోరి చేసుకున్న అనూరాధే బేబి అని తెలియగానే నేనే ఏదో నేరం చేసినట్టనిపించింది. నిజం కళ్యాణికి చెప్పే సాహసం చెయ్యలేకపోయాను ! నిజం చెప్పి కళ్యాణి దృష్టిలో మేం దోషులవడం ఇష్టం లేకపోయింది. యెలాగో మొహం చాటు చేసుకుని ఇంటికి వచ్చేశాను.

ఇంట్లోకూడా ఎవరితో చెప్పలేకపోయాను. ఇప్పుడిప్పుడే జరిగింది మరచి కోడలిని అభిమానిస్తున్న అమ్మ నాన్నకి అసలు సంగతి చెప్పి, చేతులారా వదినపట్ల సద్భావం పోగొట్టదలచలేదు ! ఆ నమ్మలేని నిజాన్ని నాలోనే దాచుకున్నాను.

అనూరాధ !.... చాలా అందమైన మనిషి ! అందుచే ముందెంత తగుపులాడినా కోడలి అందానికి, అమాయకంగా ఏ పాపం ఎరగనట్టు, అసలు తలపెట్టలేనంత అమాయకంగా కనిపించే వదినని క్రమంగా అభిమానించడం మొదలెట్టారు. మనిషిలాగే మనసూ మంచిదనిపించింది మా అందరికి. ఇంట్లో అందరిని మంచిచేసుకుని, కొద్దిరోజుల్లోనే అందరి అభిమానానికి పాత్రురాలైంది.

ఇప్పటికి అన్నయ్య సంసారం ఎంతో చూడ ముచ్చట ! ఎవరు చెప్పగలరు ? ఒకరి అదృష్టం, మరొకరికీ మహా దురదృష్టం! ఒకరి ఆనందం మరొకరికి కంటకం !"—

అంతా చెప్పి సుందరి నిట్టూర్చింది.

పిల్లలు వచ్చే వేళయిందని ఇంటికి వచ్చేశాను. ఆలోచిస్తూంటే నిజంగా ఇలాంటి చేదు నిజాలు యెందరి జీవితాలల్లో ఎదురు అవుతాయో అనిపించింది.